తెలుగు దినపత్రిక

ప్రభాత **జయభేరి**

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

jayabherinews

JAYABHERIDAILY.COM

21-11-2024
గురువారం
మల్కాజిగిరి

సంపుటి : 02 | సంచిక : 76 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి




...మిగతాది 2 లో

# అసెంబ్లీకి రా సామి...

## కేసీఆర్ కు రేవంత్ రిక్వెస్ట్

**జయభేరి, కరీంనగర్, నవంబర్ 20:**

మాజీ సీఎం కేసీఆర్.. ప్రజలనే కాదు వేములవాడ రాజన్ననూ మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆయన పదేళ్లలో చేయలేని పనులు తాము 10 నెలల్లో చేసి చూపించామని అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడి చెరువులో బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగసభ లో ఆయన మాట్లాడారు. 'కేసీఆర్‌ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలోనే నిర్ణయించుకున్నా. ఇంది రమ్మ రాజ్యంలో వేములవాడను అభివృద్ధి చేసుకుం టున్నాం. మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం. ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. ఈ నెల 30న మరోసారి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇక్కడకు వచ్చి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై సమీక్ష చేస్తారు.' అని పేర్కొన్నారు.దేశానికి దశ దిశ సూచించిన నేత పీవీ పుట్టిన గడ్డ కరీంనగర్ అని రేవంత్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ఈ కరీంనగర్ గడ్డపై నుంచే సోనియమ్మ మాట ఇచ్చి దాన్ని నిజం చేశారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపిస్తే జిల్లాకు ఏం ఒరిగింది?. కరీంనగర్ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా? జిల్లా అభివృద్ధికి చిల్లి గవ్వ తెచ్చారా?. అలా చేసి ఉంటే జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలేవా.?



2 లో


### నదుల అనుసంధానం నా జీవితాశయం

# ప్రతి ఎకరాకు సాగునీరు

- వంశధారగోదావరికృష్ణాపెన్నా నదులు అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు
- పోలవరం రాష్ట్రానికి జీవనాడి... వెన్నెముక
- 2027నాటికే పోలవరం ప్రాజెక్టు నిర్మించి తీరుతాం
- జనవరి నుండి కొత్త డయాఫ్రం వాల్ పనులు ప్రారంభం
- 45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం
- 2019 నాటికి పోలవరంపై రూ.16,493 కోట్లు ఖర్చు చేస్తే... గత ప్రభుత్వంలో కేవలం రూ.4,099 కోట్లే ఖర్చు
- సాగునీటి ప్రాజెక్టులపై శాసనసభ లఘుచర్చలో సీఎం చంద్రబాబు

### 50 గజాల్లో 4 అంతస్తుల భవనం

# కూల్చేసిన హైడ్రా



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 20:**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని సిద్ధిఖీనగర్ లో నాలుగంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. దీంతో అందులో నివసిస్తున్న వారు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. అతి తక్కువ స్థలం 50 గజాల్లో జీ+4, పెంట్ హౌస్ నిర్మాణం చేపట్టడమే భవనం పక్కకు ఒరగడానికి కారణమని అధికారులు చెబుతున్నారు. భవనం పక్కకు ఒరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.కొండాపూర్ డివిజన్ లోని సిద్ధిఖీనగర్‌లో ప్లాట్ నెంబర్ 1639లో 50 గజాల స్థలంలో వి.లక్ష్మణ్, స్వప్న దంపతులు హ్యాపీ రెసిడెన్సీ పేరుతో నాలుగు అంతస్తుల భవనం, పైన పెంట్ హౌస్ నిర్మించారు. మంగళవారం రాత్రి ఈ భవనం ఒక్కసారిగా పక్కకు ఒరగడం అందులో నివసిస్తున్న వారు భయాందోళన గురయ్యారు. భవనంలో దాదాపు 50 మంది నివసిస్తున్నారు. వారంతా ప్రాణభయంతో

...మిగతాది 2 లో




# జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో 1000 కోట్లు

**జయభేరి, ముంబై, నవంబర్ 20:**

ఈనెల 20న జార్ఖండ్, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల నిర్వహణ కోసం మహారాష్ట్ర, జార్ఖండ్ ప్రాంతాలలో ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల జరిగే ఈనెల 20 వరకు విస్తృతమైన నిఘా కొనసాగింది. ఈ క్రమంలో ఎక్కడికి అక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. నగదు తీసుకెళ్లే విషయంలో పరిమితి విధించింది. అయితే ఎన్నికల సంఘం విధించిన పరిమితిని దాటి నగదు తరలించే వారిని అదుపులోకి తీసుకుంది. వారి వద్ద నుంచి భారీగా క్యాష్ స్వాధీనం చేసుకుంది. ఇలా ఇప్పటివరకు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలలో 1,082 కోట్ల సొత్తును ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుంది. అయితే

...మిగతాది 2 లో



2 లో

# వేములవాడలో అభివృద్ధి పరుగులు

**జయభేరి, కరీంనగర్, నవంబర్ 20:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తున్నారు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన సీఎంకు మంత్రులు ఘన స్వాగతం పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటంచారు. వేములవాడకు చేరుకునున్న సీఎంకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు స్వాగతం పలికారు.సీఎం రేవంత్ రాజరాజేశ్వర స్వామి దర్శనం చేసుకుని, అభిషేకం నిర్వహించి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

# కంచే చేను మేస్తే..!

కా.. కా

"కమిషనర్"...

కమిషన్ల పోచారం

3 లో



3 లో

# వైఎస్ఆర్సీపీ బురద రాజకీయం

- హోంమంత్రి వంగలపూడి అనిత
- వైసీపీ నిర్వాకంవల్లే విజయవాడకు వరద విపత్తు
- రేయింబవళ్లూ శ్రమించి బుడమేరు గండ్ల పూడ్చివేతను పూర్తి చేసిన మంత్రి నిమ్మల
- 20 నిమిషాలు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించకుండా ప్రభుత్వాన్ని విమర్శించడమా?
- విజయవాడ, బుడమేరు వరదలపై మండలిలో హోంమంత్రి సమాధానం
- మండలిలో హోంమంత్రికి అండగా నిలిచిన మంత్రి నారాలోకేష్
- విశాఖపట్నంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు పటిష్ట చర్యలు

▸▸ మొదటిపేజీ తరువాయి

## అసెంబ్లీకి రా సామి...

పదేళ్లలో రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. రూ.100 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదు?. మీ నొప్పికి మా కార్యకర్తలకు మందు ఎక్కడ పెట్టాలో తెలుసు. రుణమాఫీపై దుష్ప్రచారం చేసున్న మీకు.. ధైర్యం ఉంటే నిజాన్ని ఎదుర్కొనే సత్తా ఉంటే అసెంబ్లీకి రావాలి. మా వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెబుతారు.' అని సీఎం సవాల్ విసిరారుపది నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని వీటిని లెక్క కట్టి చూపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అధికారం లోకి వచ్చిన 10 నెలల్లోనే ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్పారు. ఇందులో ఒక్క తల తగ్గినా ఎల్బీ స్టేడియం వేదికగా నేను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. 'మీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో... మా పది నెలల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో చర్చకు పెడదాంరా. ఆనాడు వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లలో కేసీఆర్ ప్రాజెక్టుల కోసం రూ.1.23 లక్షల కోట్లు ఖర్చు చేశారు. రూ.11 వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేళ్లు తీసుకున్నారు. 25 రోజుల్లో 23 లక్షల కుటుంబాలకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రుణమాఫీ లెక్కలు తీసి చూపిస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ సంగతి తేలుస్తాం.' అని అన్నారు.రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగాలు వస్తాయని భూ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. 'కొడంగల్‌లో భూసేకరణ చేస్తే మీకు కడుపుమంట దేనికి? అభివృద్ధి జరగాలంటే భూసేకరణ జరగాల్సిందే. భూములు కోల్పోయి బాధలో ఉన్న వారిని మా ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుంది. పరిహారం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూమి కోల్పోతున్న వారికి 3 రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం. చివరగా కేసీఆర్‌కు ఒక్క మాట చెబుతున్నా. అసెంబ్లీకి రా సామి.. ఒక్కసారి రా. వస్తే రోజంతా చర్చ చేద్దాం. అన్ని లెక్కలు తేలుద్దాం.' అని సీఎం అన్నారు.

## జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో 1000 కోట్లు

ఈ సొత్తులో 181 కోట్ల నగదు, 119 కోట్ల విలువైన మద్యం, 123 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, 302 కోట్ల ఆభరణాలు, 354 కోట్ల విలువైన బహుమతులు ఉన్నాయి. ఇక సోమవారం నాటితో మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో ప్రలోభాలకు తెర లేచింది.జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం ఝార్ఖండ్, మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలను కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి, బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా ఓటర్లకు వరాలు ప్రకటించాయి. అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను రెట్టింపు స్థాయిలో అమలు చేస్తామని ఆశపెట్టాయి. పోటాపోటీగా ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించాయి. అయితే 20 తారీఖు పోలింగ్ ఉన్న నేపథ్యంలో.. నేతలు డబ్బు పంపిణీకి రంగం సిద్ధం చేశారు. ఒక్కో ఓటుకు 700 నుంచి 1000 చొప్పున పంచుతున్నారు. సున్నితమైన నియోజకవర్గాలలో మరింత ఎక్కువ స్థాయిలో డబ్బులు పంచుతున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారీగానే డబ్బు పంచారు. అయితే ఆ రికార్డును ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలు బ్రేక్ చేస్తున్నాయి. ఇక మంగళవారం నాడు భారీగానే డబ్బు స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. 24/7 అనేలాగా తనిఖీ కేంద్రాల వద్ద సోదాలు నిర్వహిస్తున్నామని చెబుతున్నారు.డబ్బులు పంపిణీ మాత్రమే కాదు.. గ్రామాలలో బెట్టింగ్ల జోరు కూడా సాగుతోంది. ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారు? ఎంత మెజారిటీతో గెలుస్తారు? అనే అంశాల ఆధారంగా గ్రామాలలో బెట్టింగులు నడుస్తున్నాయి. నూటికి 500 చొప్పున బెట్టింగులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలంగాణకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలలో బెట్టింగుల వ్యవహారం జోరుగా సాగుతుందని తెలుస్తోంది. అయితే ఇందులో తెలంగాణ వారు కూడా పాల్గొంటున్నారని సమాచారం.. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో మహారాష్ట్రకు సరిహద్దులో ఉంటాయి. ఈ జిల్లాల వారికి మహారాష్ట్ర ప్రజలతో సంబంధం బాంధవ్యాలు ఉంటాయి. కొందరికి బంధుత్వాలు కూడా ఉంటాయి.

## భవనం కూల్చేసిన హైడ్రా

బయటకు పరుగు తీశారు. మూడో అంతస్తులో ఉంటున్న ఇక్బాల్ హుస్సేన్ అనే వ్యక్తి భయంతో పైనుంచి దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. 50 గజాల స్థలంలో రెండేళ్ల కిందట గ్రౌండ్ ఫ్లోరు, నాలుగు అంతస్తుల్లో రెండేసి గదులు, పెంట్ హౌస్‌లో ఒక గది చొప్పున నిర్మించారు. ఈ రూములతో స్థానికంగా ఉపాధి పొందుతున్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 50 మంది నివసిస్తున్నారు. మూడు రోజుల కిందట ఆ బిల్డింగ్ వెనుక భాగంలో మరో కొత్త భవనం నిర్మాణ పనులు మొదలయ్యాయి. మంగళవారం ఉదయం హ్యాపీ రెసిడెన్సీకి ఆనుకుని రెండు పిల్లర్లకు భారీ గుంతలు తవ్వారు. దీంతో రాత్రి 8.30 గంటల ప్రాంతంలో నాలుగంతస్తుల భవనం ఒక్కసారిగా గుంతల వైపునకు ఒరిగిపోయింది. భవనంలో నివసిస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, జీహెచ్ఎంసీ, విపత్తు నిర్వహణ అధికారులు, సిబ్బంది...హ్యాపీ రెసిడెన్సీతో పాటు దాని పక్కనున్న మరో రెండు బిల్డింగ్ లను ఖాళీ చేయించారు. వారందరినీ స్థానికంగా ఉన్న కమ్యూనిటీ హాలుకు తరలించారు. ఒరిగిన బిల్డింగ్‌ను కూల్చివేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా 50 గజాల్లో ఆరు స్లాబులు వేయడం చూసి అధికారులు షాకయ్యారు. గదులు అగ్గిపెట్టెలను తలపిస్తున్నాయన్నారు. బిల్డింగ్ తొలిగించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## వేములవాడలో అభివృద్ధి పరుగులు

ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ వేములవాడ ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ. 800 కోట్లతో వివిధ అభివృద్ధి సంక్షేమ పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు.పలు అభివృద్ధి పనులకు శ్రీకారం.. రూ. 76 కోట్లతో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంఖుస్థాపన చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని అన్నదాన సత్రానికి 35.25 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగష్టులో స్వామి వారి దర్శనానికి వచ్చినపుడు హామీ ఇచ్చి, కేవలం మూడు నెలలు గడిచేలోగా ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్తర్వులు ఇప్పించారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా, మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయానికి అన్నదాన సత్రం మంజూరు చేయడం పై రాజన్న భక్తుల హర్షం.

**జిల్లాలో అభివృద్ధి పనులు..**

రూ.235 కోట్లతో 4696 మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు భూమి పూజ చేశారు. రూ.50 కోట్లతో చేపట్టే నూలు డిపో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రూ. 45 కోట్లతో చేపట్టే మూల వాగు బ్రిడ్జి నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 166 కోట్లతో చేపట్టే వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రూ.35 కోట్లతో చేపట్టే అన్నదానం సత్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 52 కోట్లతో కొనరావుపేట మండలంలో చేపట్టే హై లెవెల్ బ్రిడ్జి పనులు, రూ. 3 కోట్లతో నిర్మించే డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. మేడిపల్లి మండలంలో జూనియర్ కళాశాల రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల లో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో రూ. కోటి 45 లక్షలతో నిర్మించిన జిల్లా గ్రంధాలయ భవనం, రూ. 4 కోట్ల 80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనం ప్రారంభించారు. గల్ఫ్ దేశాలలో మరణించిన 17 కుటుంబాలకు 85 లక్షల పరిహారం పంపిణీ చేశారు. 631 శివశక్తి మహిళా సంఘాలకు 102 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు పంపిణీ చేశారు.

# నదుల అనుసంధానం నా జీవితాశయం..

# ప్రతి ఎకరాకు సాగునీరు

- వంశధారగోదావరికృష్ణాపెన్నా నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు
- పోలవరం రాష్ట్రానికి జీవనాడి... వెన్నెముక
- సవాళ్లను అధిగమిస్తాం... 2027నాటికే పోలవరం ప్రాజెక్టు నిర్మించి తీరుతాం
- జనవరి నుండి కొత్త డయాఫ్రం వాల్ పనులు ప్రారంభం
- 45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం...ఎత్తు తగ్గింపు మాటలు నమ్మొద్దు
- 2019 నాటికి పోలవరంపై రూ.16,493 కోట్లు ఖర్చు చేస్తే.... గత ప్రభుత్వంలో కేవలం రూ.4,099 కోట్లే ఖర్చు
- సాగునీటి ప్రాజెక్టులపై శాసనసభ లఘుచర్చలో సీఎం చంద్రబాబు నాయుడు



**జయభేరి, అమరావతి:**

'రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి, వెన్నెముక. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు అనేది ఉండదు. కరవు నివారించి రైతులకు నీళ్లిస్తే బంగారం పండిస్తారు. ప్రతి ఎకరాకు నీరందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. ఫ్లోరైడ్ నీళ్లతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది. నదుల అనుసంధానం నా జీవిత ఆశయం... కల. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. శాసన సభలో మంగళవారం లఘుచర్చలో భాగంగా సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**రాజకీయ కక్షతో పోలవరంను నాశనం చేశారు**

పోలవరం ప్రాజెక్టు ఒక చరిత్ర ఉంది. 1941లో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు ఏర్పడ్డాయి. మొదట 170 అడుగుల ఎత్తులో, తర్వాత 208 అడుగుల ఎత్తులో నిర్మించి 340 నుండి 700 టీఎంసీల దాకా నిల్వ చేయాలని చూశారు. దీనికి రామపాద సాగర్ గా నామకరణం చేశారు. అప్పట్లోనే పూర్తి చేస్తే రూ.129 కోట్లతో పూర్తయ్యేది..కానీ నేడు రూ.55 వేల కోట్లకు అంచనా వ్యయం పెరిగింది. నాడు ఈ ప్రాజెక్టు పూర్తై ఉంటే నేడు సుభిక్షింగా ఉండేది. 15.5.1981లో నాటి సీఎం అంజయ్య శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. రాజశేఖర్ రెడ్డి వచ్చాక అస్తవ్యస్తం చేశారు.రాష్ట్ర విభజనతో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ఆదాయం వచ్చే హైదరాబాద్ తెలంగాణకు వెళ్లింది...పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అమరావతి, పోలవరంను రెండు కళ్లలా భావించి పూర్తి చేసేందుకు శ్రద్ధ పెట్టాం. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాం. 2014లో ఎన్నికల ఫలితాలు రాగానే రాజ్ నాథ్ సింగ్, వెంకయ్య నాయుడుని కలిసి పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలపకపోతే ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారుతుందని, సీఎంగా ప్రమాణస్వీకారం చేయనని చెప్పాను. కేంద్రం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేసి చేసింది. సమస్యలన్నీ అధిగమించాం. రైట్ మెయిన్ కెనాల్ పటిష్ట పరిచాం. పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లుతెచ్చి కృష్ణాగోదావరి నదులను అనుసంధానం చేశాం. సమయానికి వర్షాలు పడని సమయంలో ఎగువ నుండి కృష్ణా డెల్టాకు నీరు ఆలస్యంగా వస్తుంది. కానీ పట్టిసీమ పూర్తి చేయడం ద్వారా జూన్ లోనే నీరందించాం. అప్పుడు కూడా పట్టిసీమ దండగ అని వైసీపీ రాజకీయం చేసింది. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లు అందించాం. శ్రీశైలంలో నీటి నిల్వ చేయడం ద్వారా సీమకు అందించాం. అనంతపురం జిల్లాకు నీళ్లిస్తే రాష్ట్రంలోనే ధనిక జిల్లాగా అనంతపురం మారుతుంది. కియా పరిశ్రమను అనంతపురం జిల్లాకు తేవాలన్నప్పుడు నీటి ప్రతిపాదన వచ్చింది. దీంతో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి చూపించాం. బెంగళూరు విమానాశ్రయానికి అనంతపురం దగ్గరగా ఉంటుంది...పని చూసుకుని వెళ్లొచ్చని సూచించాం. దీంతో అనంతకు కియా కార్ల పరిశ్రమ వచ్చింది.

**2014-19 నడుమ పోలవరం పరుగులు**

2014, 19 మధ్య పోలవరం ప్రాజెక్టును పరిగెత్తించాం. ప్రాజెక్టును పూర్తి చేయడానికి పీపీఏ, సీడబ్ల్యూసీని సమన్వయం చేసుకుని ముందుకెళ్లాం. ఒక్క రోజులోనే స్పిల్ ఛానల్ కోసం 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాం. కానీ డయాఫ్రం వాల్ ఎక్కడుందో కూడా తెలియని వాళ్లు మంత్రిగా గత ఐదేళ్లు చేశారు. డయాఫ్రం వాల్ 2కి.మీ పొడవును 100 మీటర్ల లోతులో జర్మన్ టెక్నాలజీ ద్వారా 414 రోజుల్లో పూర్తి చేశాం. ప్రాజెక్టుకు గేట్ల అమరికను కూడా ప్రారంభించాం. స్పిల్ ఛానల్ పూర్తి చేశాం. మొత్తంగా ప్రాజెక్టును 72 శాతం మేర పూర్తి చేశాం. నేను నేరుగా పోలవరాన్ని 28 సార్లు సందర్శించా...82 సార్లు వర్చువల్ గా సమీక్ష చేశాను. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పూర్తయ్యేది. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వంతో రివర్స్ టెండరింగ్ వేసింది. బుద్ధిజ్ఞానం ఉన్నవాళ్లు ఇలాంటి పనులు చేస్తారా.? రాజకీయ కక్షతో ప్రాజెక్టును నాశనం చేశారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే ప్రాజెక్టును నిలిపేస్తున్నట్లు చెప్పారు. సైట్ లో నిర్మాణ సంస్థను కూడా ఖాళీ చేయించారు. అధికారులను మార్చేశారు. అవగాహన రాహిత్యం, చేతకానితనంతో ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. కనీసం 15 నెలల పాటు ప్రాజెక్టు వైపు కన్నెత్తి చూడలేదు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలతో డయాఫ్రంవాల్ దెబ్బతింది. ఏడాదిపాటు డయాఫ్రం వాల్ దెబ్బతిందని కూడా నిర్ధారించలేకపోయారు. కుట్ర, అవినీతి, అనాలోచిత నిర్ణయం వల్ల ప్రాజెక్టు సర్వనాశనం అయింది. సెంట్రల్ వాటర్ కమిషన్ హైదరాబాద్ ఐఐటీ ప్రతినిధులను పంపి పరిశీలన చేయించి డయాఫ్రం వాల్ దెబ్బతిందని నిర్ధారించారు. రూ.440 కోట్లతో నాడు డయాఫ్రం వాల్ నిర్మించాం...ఇప్పుడు దాన్ని రిపేరు చేయాలంటే రూ.490 కోట్లు అవసరం అవుతుంది. అయినా నిలబడుతుందని గ్యారంటీ లేదు. దీంతో మళ్లీ కొత్తడయాఫ్రం వాల్ కట్టడం వల్ల రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. ప్రాజెక్టు ఆలస్యం, ఖర్చు ఎక్కువ అవ్వడంతో వేల కోట్ల నష్టం వాటిల్లింది. 2019 నాటికి 71.93 శాతం పూర్తి చేస్తే...గత ప్రభుత్వం కేవలం 3.84 శాతం మాత్రమే పూర్తి చేసింది. నాడు మేము ప్రాజెక్టుపై ప్రశ్నిస్తే ఇదే సభలో ఒక మంత్రి పర్సెంటా..అరపర్సంటా తొందరెందుకున్నా అని హేళనగా మాట్లాడారు. ఒకరికి క్యూసెక్కుకు, టీఎంసీకి తేడా తెలీదు.

**45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం డ్యాం నిర్మాణం**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 2019 నాటికి రూ.16,493 కోట్లదాకా ఖర్చు పెడితే, గత ప్రభుత్వం కేవలం రూ.4,900 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. పోలవరం పూర్తయితే 190 టీఎంసీలు నింపుకోవచ్చు. అన్ని విధ్వంసాలు చేసింది కాక మళ్లీ గోదావరి నుండి శ్రీశైలానికి నీళ్లు తీసుకెళ్తామని చెప్పారు. గతంలో ఎన్టీఆర్ రాయలసీమకు నీళ్లివ్వకుండా తమిళనాడుకు నీళ్లివ్వమని చెప్పారు. తమిళనాడుకు 5 టీఎంసీలు నీళ్లివ్వడంతో పాటు కాల్వల ద్వారా నెల్లూరు జిల్లాకు నీళ్లు వెళ్తున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చూసినా టీడీపీ హయాంలో పూర్తి చేసినవే. పోలవరం ఎత్తు 45.72 మీటర్లుగానే ఉంటుంది. కానీ గత పాలకులు ఫేజ్ 1 అంటూ 41.15 మీటర్లకు నిర్ణయించారు. 45.72 మీటర్ల ఎత్తుతోనే ప్రాజెక్టు నిర్మాణం ఉంటుంది. దీనికి కేంద్రం కూడా కట్టుబడి ఉంది. ఎత్తు తగ్గిస్తారని డ్రామాలు ఆడుతున్నారు. పోలవరం ద్వారా 350 టీఎంసీల నీళ్లు ఉపయోగించుకోవచ్చు. కుడి కాల్వ ద్వారా 3.20 లక్షల ఎకరాలు, ఎడమ ద్వారా 4 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుంది. మరో 24 లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చు. 80 టీఎంసీలను కృష్ణా ఆయకట్టుకు, 23.44 టీఎంసీల నీటిని విశాఖకు తరలించవచ్చు. 960 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. 540 గ్రామాల్లోని 29 లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. పోలవరం నిర్మాణం మనందరి బాధ్యత. నిర్దిష్ట సమయంలోనే ప్రాజెక్టును పూర్తి చేస్తాం. సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి పోలవరంనే సందర్శించాను. ప్రాజెక్టు పూర్తికి కేంద్రం రూ.12,157 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించేందుకు ఇప్పటికే రూ.2,345 కోట్లు విడుదల చేయడంతో పాటు రూ.460 కోట్లు రీయింబర్స్ చేసింది. ప్రాజెక్టును పూర్తి చేసే కొద్దీ డబ్బులు ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది.

**రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరందిస్తాం**

'శ్రీశైలం నుండి ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, తెలుగు గంగ, గాలేరు, నగరి ద్వారా రాయలసీమకు నీరిస్తాం. హంద్రీనీవా సుజల శ్రవంతి ఫేజ్1, ఫేజ్2 ద్వారా గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టు, కేసీ కెనాల్, భైరవానితిప్ప, తుంగభద్ర లో లెవల్ కెనాల్, హై లెవల్ కెనాల్, అప్పర్ పెన్నా, వేదావతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల ద్వారా రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరందిస్తాం. కర్నూలు జిల్లాలో 3, 4 నియోజకవర్గాలకు తప్ప మిగతా అన్ని ప్రాంతాలకు నీటి సమస్యను అధిగమించవచ్చు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతానికి కూడా నీరందిస్తాం. గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ మెయిన్ కెనాల్ కూడా పూర్తి చేస్తాం. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముందుకెళ్తాం. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు నాగార్జున సాగర్ కుడికాల్వ, వెలుగొండ, గుండ్లకమ్మ, సోమశిల ప్రాజెక్టు, హైలెవల్ లెఫ్ట్ కెనాల్, సోమశిలస్వర్ణముఖి లింక్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్, శ్రీనివాస రిజర్వాయర్, మల్లెమడుగు, స్వర్ణముఖి రిజర్వాయర్ ద్వారా నీళ్లిస్తాం. కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావర జిల్లాలకు పోలవరం కుడి కాల్వ సమగ్ర వినియోగంతో పాటు పులిచింతల, చింతలపూడి ఎత్తిపోతలతో పాటు గోదావరి కృష్ణాపెన్నా నదుల అనుసంధానం ఫేజ్ 1 ద్వారా సాగర్ కుడి కాల్వకు నీళ్లిస్తాం. వరికపూడిశెల, వేదాద్రి, గుంటూరు ఛానల్ విస్తరణ, పట్టిసీమ, తాడిపూడి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తాం. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు పోలవరం ఎడమ కాల్వ, పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతలగోదావరి ఏలేరు అనుసంధానం ద్వారా ఆ జిల్లాలకు నీరందిస్తాం. గోదావరి నీళ్లు ప్రకాశం బ్యారేజీకి తెచ్చి సాగర్ రైట్ మెయిన్ కెనాల్ కు మళ్లిస్తాం. సాగర్ మెయిన్ కెనాల్ కు గోదావరి నీళ్లు 150 టీఎంసీలు తీసుకెళ్తే...శ్రీశైలంలో మిగులు నీళ్లు నిల్వ చేస్తే సీమకు ఆ నీటిని అందించవచ్చు. బొల్లాపల్లిలో రిజర్వాయర్ కడితే 150 టీఎంసీలు నిల్వ చేయవచ్చు. బొల్లాపల్లి బ్యాక్ వాటర్ ను నుండి నాగార్జున సాగర్ కు తీసుకెళ్లవచ్చు. పోలవరం నుండి కృష్ణానదికి, అక్కడి నుండి బొల్లాపల్లి, బొల్లాపల్లి నుండి సోమశిల ప్రాజెక్టుకు ప్రతిపాదనలపై చర్చిస్తున్నాం. ఈ ప్రాజెక్టును అనుకున్న విధంగా పూర్తి చేసి రాయలసీమకు నీటి కష్టాలు తీరుస్తాం. దీనికి సుమారు రూ.70 వేల కోట్లు ఖర్చు అవుతుంది.

**వెలుగొండను పూర్తి చేయకుండానే రిబ్బన్ కట్ చేశారు**

**'ఏటా కొన్ని వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి నది ద్వారా 4,215 టీఎంసీల నీళ్ల సముద్రంలో కలిశాయి. అందులో వాడుకుంది మనం 126 టీఎంసీలు మాత్రమే. కృష్ణా నుండి 845 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. మన రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 1015 టీఎంసీలు. ఈసారి దేవుడు కరుణించడంతో అన్ని రిజర్వాయర్లలో నీళ్లున్నాయి. 900 టీఎంసీల నీళ్లు రిజర్వాయర్లలో ఉన్నాయి. వరుణదేవుడు మాతోనే ఉన్నాడని చెప్పుకున్న వారి హయాంలో 400 టీంసీలు కూడా లేవు. ఈ యేడాది నీళ్లు సముద్రంలో పోతుంటే చూసి నిద్రరాలేదు. అన్ని రిజర్వాయర్లలో నీళ్లు నింపితే రెండేళ్ల పాటు కరవు రాదని ఆలోచించి ప్రాజెక్టులను నీటితో నింపేందుకు శ్రద్ధ పెట్టాం. జలవనరుల శాఖ అధికారులు, మంత్రి నిమ్మల రామానాయుడును అభినందిస్తున్నా. తుంగభద్ర డ్యాంమ్ లో గేటు కొట్టుకుపోతే కర్నాటక ప్రభుత్వం వదిలేసింది. మనం కన్నయ్య నాయుడుని పంపి గేటు అమర్చేలా చేసి నీటి వృధాను అరికట్టాం. వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే...పూర్తి చేసి ప్రారంభించేది కూడా నేనే. పనులు పూర్తి చేయకుండానే జగన్ రిబ్బన్ కట్ చేశారు. కుప్పంలో అయితే ఇక సినిమా సెట్టింగ్ వేసి ట్యాంకర్లలో నీళ్లు తెచ్చిపోసి డ్రామాలు ఆడారు. నీళ్లెక్కడ అని కుప్పం రైతులు అడిగితే సమాధానం లేదు. హంద్రీనీవా కాల్వను విస్తరించి వచ్చే యేడాది కుప్పం, మడకశిరకు నీళ్లు ఇస్తాం. భైరవానితిప్ప, పేరూరు డ్యాములు కూడా పూర్తి చేస్తాం. నదుల అనుసంధానం ద్వారా ప్రతి మారుమూల గ్రామానికి నీరందిస్తే తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవు.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.**

**జనవరి నుండి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం**

'2025 జనవరి నుండి కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టి 2026కు పూర్తి చేస్తాం. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా విశాఖ, అక్కడి నుండి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా నీరందిస్తాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో తట్టమట్టి కూడా తీయలేదు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ కు రూ.960 కోట్లతో త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే వర్షాకాలం నాటికి అనకాపల్లికి నీరందిస్తాం. పోలవరం ఎడమ కాల్వ ద్వారా వంశధార వరకు అనుసంధానం చేయాలనే ఆలోచనలో ఉన్నాం. తద్వారా వంశధారలో ఎక్కువ నీరు ఉంటే దిగువకు కూడా వచ్చేలా చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1 ఫిబ్రవరి 2026 నాటికి, గ్యాప్2 2027 డిసెంబర్ నాటికి పూర్తవుతుంది. ఎట్టిపరిస్థితుల్లో 2027 నాటికి పోలవరం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. కూటమి ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి గర్వంగా ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పేలా చేస్తాం. గోదావరి నీళ్లు ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి, వంశధార ఫేజ్ 2, తోటపల్లి, రామతీర్థ సాగరం, మహేంద్రతనయ ఆఫ్ షోర్, ముద్దవలస, జంఘావతి, నాగావళివంశధార అనుసంధానం, వంశధారబహుదా అనుసంధానం చేసి తూర్పు గోదావరి నుండి ఉత్తరాంధ్ర వరకు 200 టీఎంసీల వృధా జలాలను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా రూపకల్పన చేస్తాం.


# మరో పదేళ్లు చంద్రబాబే సీఎం కావాలి

**జయభేరి, విజయవాడ, నవంబర్ 20 :**

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబుకు మాట ఇస్తున్నానని.. మేం చేయాల్సిన పనులపై ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు విజన్‌కు తగ్గట్టు పనిచేస్తామని.. సీఎం కలలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఐదేళ్లే కాదు మరో పదేళ్లు చంద్రబాబు సీఎంగా ఉండాలని.. చంద్రబాబు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.సమర్థులైన నాయకుడు ఉంటే ఎలా ఉంటుందనేది చంద్రబాబును చూసి తెలుసుకోవచ్చని అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ప్రశంసించారు. విజయవాడ వరదల సమయంలో అధికార యంత్రాంగాన్నని దగ్గర ఉండి నడిపిన తీరు అభినందనీయమని ...తెలుగు వారు ప్రపంచ వ్యాప్తంగా ఉండటానికి చంద్రబాబు ముఖ్య కారణమని గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలు వచ్చాయని .. ప్రతినెల ఒకటో తేదీన కూటమి ప్రభుత్వంలో వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు, అప్పులు ఈ ప్రభుత్వానికి సవాల్ గా మారాయని అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేశామని తెలిపారు. పవన్ నోట చంద్రబాబు మరో పదేళ్లు సీఎం అనే ప్రకటన రావడం రాజకీయవర్గాలను సహజంగానే ఆశ్చర్య పరుస్తోంది. ఎందుకంటే ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా పవన్ సీఎం అవుతారని జనసైనికులు నమ్మకంతో ఉన్నారు. అయితే పవన్ మాత్రం రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఉందని అంటున్నారు. అందుకే చంద్రబాబు సీఎంగా ఆ తర్వాత కూడా మరో పదేళ్లు కొనసాగాలని అంటున్నారు. ఇలాంటి మాటలన్నీ ప్రస్తుత ప్రభుత్వంపై నమ్మకం ..కూటమిపై విశ్వాసం చేయడం మాత్రమేనని.. .ఇప్పుడు అన్నారంటే దానికే కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని మరికొందరు వాదిస్తున్నారు. కారణం ఏదైనా చంద్రబాబు నాయకత్వం విషయంలో పవన్ కల్యాణ్ చాలా స్పష్టతతో ఉన్నారు. ఎక్కడా ఎలాంటి ఊహాగానాలు రానివ్వడం లేదు.ఇటీవలి కాలంలో ఆయన హిందూత్వ నినాదం తీసుకుని జాతీయస్థాయిలో తన ప్రత్యేక చూపేందుకు ప్రయత్నిస్తున్నారని దీని వెనుక ఎవరికీ తెలియని రాజకీయం ఉందని చెప్పుకుంటున్న సమయంలో పవన్ వ్యాఖ్యలు సహజంగానే హాట్ టాపిక్ అవుతున్నాయి.

# నా వంతు సహకారాన్ని అందిస్తా..

- చిల్కానగర్ డివిజన్లోని కురుమ వైకుంఠధామానికి 20 లక్షల రూపాయలు కేటాయించినందుకు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ కి ఘనంగా సత్కరించిన కురుమ సంఘం నాయకులు
- కురుమ సోదరుల అభివృద్ధికి ఎల్లప్పుడు నా వంతు సహకారాన్ని అందిస్తా : కార్పొరేటర్ బన్నాల



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ కురుమ సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ని మర్యాదపూర్వకంగా కార్పొరేటర్ కార్యాలయంలో కలిసి కురుమ వైకుంఠధామంలో శిథిలావస్థకు చేరిన బాత్రూంలను నూతన బాత్రూంలు నిర్మించుటకు 20 లక్షల రూపాయలు కేటాయించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేష్ మరియు వారి కార్య బృందం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ నీ గొంగడి, రుమాలు, శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని, తెలుపుతూ కురుమ వైకుంఠధామం అభివృద్ధి కోసం ఇంకా నిధులు వెచ్చిస్తానని హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు చిందం వెంకటేష్ కి, వారి కార్య బృందానికి అభినందనలు తెలుపుతూ సంఘం అభివృద్ధికి తోడ్పడాలని డివిజన్లోని బీరప్ప ఆలయంలో నిర్మించబోయే భవనానికి తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని తెలుపుతూ.. కురుమల అభివృద్ధికి తన తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటదని తెలియజేశారు. ఈ కార్యక్రమములో వెలుగు గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ జన్ని రఘు కురుమ, రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేష్ కురుమ, ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేశ్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షులు బర్ల కృష్ణ కురుమ, ఉపాధ్యక్షులు కొంౘ్ర హనుమంతు కురుమ, కోశాధికారి శాగ పెంటయ్య కురుమ, పెద్ద మల్లేష్ కురుమ, గొరిగే ఐలయ్య కురుమ, గొరిగే ఐలేష్ కురుమ, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీబీ నరసింహ, ముద్దం శ్రీనివాస్ యాదవ్, గూడూరు రమేష్ గౌడ్, వంజరి నర్సింగ్ రావు, శ్యామ్ మొదలగు వారు పాల్గొన్నారు.



## పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా ఎగరవేస్తాం

- ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు
- రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఈ నెల 21వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా, ముదిరాజ్ గుండెల్లో చైతన్య ఎజెండా పేరుతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన త్వరగా పూర్తిచేసి రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని అన్నారు. దీనిలో భాగంగా ముదిరాజ్ జనాభాకు తగినట్లుగా రిజర్వేషన్ల వాటా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆలాగే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అభయహస్తంలో పేర్కొన్న హామీ మేరకు ముదిరాజ్, ముత్తరాసి, తెనుగోళ్లను బిసి "డి" నుండి బిసి "ఏ" కు మార్చాలని కోరారు. సుప్రీంకోర్టు రాష్ట్ర కమీషన్ ద్వారా పరిష్కరించడానికి ఆదేశాలు జారీ చేసినందున తెలంగాణ బిసి కమిషన్ తగిన ఆదేశాలు ఇచ్చి హామీ అమలు చేయాలని తెలిపారు. ముదిరాజుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పోరేషన్ లిమిటెడ్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయితే ఆ సంస్థకు రూ 50కోట్లు మాత్రమే కేటాయించగా, సంఖ్యాపరంగా ఆలోచించి రూ 1000కోట్ల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన వివిధ జీవోల ప్రకారం చెరువులు, కుంటలు, మత్స్య సంపదపై తెనుగు, ముత్తరాశి, ముదిరాజ్, బెస్త, గంగపుత్ర మరియు గూండ్ల కులాలకు మాత్రమే హక్కులు ఉండే విధముగా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి కోసం మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్ కు వెంటనే ఎన్నికలు జరిపి చైర్మన్, పాలక మండలిని నియమించాలని పేర్కొన్నారు. తెలంగాణ మత్స్యశాఖకు రూ 3వేల కోట్లు కేటాయించి వివిధ పథకాల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని వివరించారు.

## బ్యాంకులు సెక్యూర్ గా ఉన్నాయా..!

- గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి



**జయభేరి, కుకునూరుపల్లి, నవంబర్ 20 :**

బ్యాంకులలో దొంగతనాలు తావు లేకుండా బ్యాంకు చుట్టూ నలు మూలల సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ బ్యాంకులో సీసీ కెమెరాలు పెట్టుకొని ప్రతిరోజు మానిటర్ చేయాలని సూచించారు, మరియు సెక్యూరిటీ గార్డ్ ను ఏర్పాటు చేసుకోవాలి, బ్యాంకులో ఏ సంఘటన జరిగినా అల్లారం సిస్టం పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులలో ఏదైనా సంఘటన జరిగితే కేసుల పరిశోధనలో బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు. బ్యాంకులో తప్పకుండా సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలన్నారు. ప్రజలు దాచి పెట్టుకున్న బంగారం, డబ్బులు, కాపాడడానికి సమన్వయంతో విధులు నిర్వహించాలని వారికి సూచించారు. మెయిన్ బ్రాంచ్ నుండి ఇతర బ్రాంచీలకు డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు అన్ని సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, ఎబిజీవీబీ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్, మరియు బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ బురద రాజకీయం

**జయభేరి, అమరావతి, నవంబర్,20;**



విజయవాడలో ఇటీవల వచ్చిన ఆకస్మిక వరదల సమయంలోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయం చేసిందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అసలు వైసీపీ నిర్వాకం వల్లే విజయవాడకు వరద విపత్తు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. బుధవారం జరిగిన శాసనమండలిలో మండలి సభ్యులు విజయవాడ, బుడమేరు వరదలపై అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..20 నిమిషాలు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించని వాళ్లు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమా? అంటూ హోంమంత్రి సూటిగా ప్రశ్నించారు. గతంలో ఎప్పుడూలేనంతగా విజయవాడలో వర్షపాతం 36 సెంటీమీటర్లు నమోదవడం, అంటే గతంలో లేనివిధంగా 800 రెట్లు పెరిగిందన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి 294సహాయ శిబిరాలు, 1715 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వరద బాధితులకు యుద్ధప్రాతిపదికన సహాయకచర్యలు చేపట్టిందని ఆమె స్పష్టం చేశారు. పది రోజులకు కోటి పదిహేను లక్షల మందికి ఆహార ప్యాకెట్లతో సహా అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు, వాటర్ బాటిళ్ల వంటి అన్ని వస్తువులు బాధిత కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు. ఆకస్మిక వరదలతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితిని గమనించి డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించడం వంటి సహాయక కార్యక్రమాలతో యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ వరదల కారణంగా 24వేల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 12వేల హెక్టార్ల మేర ఉద్యానపంటలు, 90వేల పశు సంపద, 672 మత్స్య పరిశ్రమకు సంబంధించిన యూనిట్లకు నష్టం వాటిల్లిందన్నారు. 98,662 గృహాలు వరద ధాటికి దెబ్బతిన్నాయన్నారు. 665 కి.మీ ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ కు సంబంధించిన రోడ్లు కూడా ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ఈ విపత్తు వల్ల 43 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత కుటుంబాలకు రూ.2కోట్ల పైన ఆర్థిక సాయమందించి ప్రభుత్వం ఆదుకున్నట్లు వెల్లడించారు. గృహనిర్మాణాలకు సుమారు రూ.204కోట్లు ఇచ్చామన్నారు. విపత్తు సాయం కింద మొత్తం సుమారు రూ.304 కోట్లను ప్రజలకు అందజేశామన్నారు. దార్శనికత కలిగిన నాయకుడు కాబట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రోన్లను ఉపయోగించి టెక్నాలజీ సాయంతో ఆహారం సరఫరా చేశారన్నారు.

సగటున ప్రతి పదేళ్లకోసారి వచ్చే విజయవాడ వరదల అంశంలో బుడమేరు కెనాల్ సామర్థ్యం 15 లక్షల క్యూసెక్కుల సామర్థ్యాన్ని పెంచడం కోసం చేపట్టిన విస్తరణ పనులకు సంబంధించి రూ.241 కోట్ల పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఎనికేపాడు, కొల్లేరు వరకూ చేపట్టాలనుకున్న బుడమేరు పాత కెనాల్ పనులకు సంబంధించి ఐదు ప్యాకేజీలకు కూడా రూ.65 కోట్లు పెండింగ్ లో ఉన్నట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. ఈ కారణాలే వల్లే విజయవాడకు ఆకస్మిక వరదలు విపత్తులా వచ్చిందని ఆమె అన్నారు. విపత్తును ఎదిరించి, అధిగమించగల దార్శనికత, అనుభవం కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు ఈ సమయంలో ముఖ్యమంత్రిగా ఉండడం ఏపీ ప్రజల అదృష్టంగా పేర్కొన్నారు. 11 రోజుల పాటు విజయవాడ కలెక్టరేట్ కార్యాలయాన్ని తన కార్యాలయంగా చేసుకుని రాత్రి పగలు తేడాలేకుడా శ్రమించిన నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ ప్రజలు 20 రోజుల జల దిగ్బంధంలో ఉంటే కనీసం 20 నిమిషాలు కూడా ప్రజల కోసం కేటాయించలేని వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అంటూ ఆమె విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరద సాయంగా రూ.1,036 కోట్లు, విరాళాల కింద రూ.450 కోట్ల పైన వచ్చిందని హోంమంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వం వల్లే ఇంత భారీ విరాళాల సేకరణ సాధ్యమైందన్నారు. టీఆర్ 27 కింద, విజయవాడ వరదల కోసం రూ.139 కోట్లు విడుదల చేయగా..అందులో రూ.89 కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలిపారు. ఫైర్ సిబ్బంది సహకారంతో ఇళ్లను శుభ్రం చేయించడం, రుణాలు కట్టడంలో వెసులుబాటు, ఇంట్లో వరదల వల్ల పాడైన వస్తువులను బాగుచేయించడం చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఆమె వివరించారు. వైఎస్ జగన్ వరద బాధితులకోసం ప్రకటించిన రూ.కోటి సాయం జమైందో లేదో స్పష్టతలేదని హోం మంత్రి పేర్కొన్నారు.

# కంచే చేను మేస్తే..!

## కా.. కా "కమిషనర్"... కమిషన్ల పోచారం

- అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న కమిషనర్..!?
- టీఎస్ బిపాసా ఉంటే నాకేంటి..!? అన్నట్టు తన వ్యవహార తీరు!
- ఇవన్నీ కాగితాల్లోనే ఉంటాయి.. ఆచరణల్లో ఉండవు..!?
- నిబంధనలు ఇంటి ముందర గేట్లు..!?
- నోటీసుల.. ఎప్పుడో ఇచ్చాం... మా దగ్గర స్టాఫ్ లేరు ఏం చేయమంటారు!? అంటూ దబాయింపు..!

**జయభేరి, ఘట్కేసర్ స్పెషల్ స్టోరీ..**





తెలంగాణలోని మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం లోగల పోచారం మునిసిపాలిటీ ఇప్పుడు వార్తల్లోకి ఎక్కుతుంది. ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే టీఎస్ బిపాస్ అనుమతులు తీసుకొని నిబంధనలకు లోబడి కట్టుకుంటారు. కానీ పోచారం మునిసిపాలిటీలో ఇల్లు కట్టుకోవాలంటే అనుమతులు అవసరం లేదట అని అన్నట్టుగా సాగుతోంది ఇక్కడికి వ్యవహారం. దీని బహిర్గంగా కమిషనరే కంచే చేను మేస్తే.. ఇలాగే ఉంటుంది అంటూ స్థానికులు కొడై కుస్తున్నారు. పోచారం మునిసిపాలిటీలోని అక్రమ నిర్మాణ దారుల నుండి తమ ఇష్టా రీతిగా కాసులు బాగానే దండుకుంటున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్న కమిషనర్ ఏ మాత్రం చలించిన పాపాన పోవట్లేదు... ఎందుకంటే ఆమ్యామ్యాలు అందాయోమో తెలియదు కానీ మొత్తానికి విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నానికి కమిషనర్ పూనుకోవడం లేదు.

పోచారంలో నిర్మాణాలకు అనుమతులు కంటే అక్రమ నిర్మాణాలే చాలా ఎక్కువగా ఉన్నాయని వార్తలు వినబడుతున్న అక్కడ అక్రమ భారీ షెడ్లకు ఎత్తైన అంతస్తులకు ఉప్పు అందిస్తున్నాడు కమిషనర్.. అందిన కాడికి దండుకుంటున్నాడు అనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

అయ్యా కమిషనర్ మీ కమిషన్ల వ్యవహారం ఆ నోట ఈ నోట పడి ఆయా వార్త దినపత్రికలో వస్తున్న అసలు చీమకుట్టినట్టైనా లేకపోవడం కమిషనర్ కమిషన్ల బాగోతానికి అద్దం పడుతుంది.. అక్రమ నిర్మాణాలు బౌలా అంతస్తులు జరుగుతున్నాయి కమిషనర్ సారు అని ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా మాకు సిబ్బంది సరిగా లేరండి మేము ఏం చేయాలో చెప్పండి చాలా బిజీగా ఉన్నామంటూ ఏవేవో అబద్ధపు సాకులు చెబుతూ అక్రమ నిర్మాణదారులకు ఎంచక్కా అడ్డదారులు తెరుస్తున్నారు. నోటీసులు ఇవ్వకముందే.. నోటీసులు జారీ చేశామండి అంటూ స్థానిక ప్రజల్ని పక్కదోవ పట్టిస్తున్నారు. అలా పక్కదోవ పట్టిస్తూ కాసులు దండుకుంటూ జోబులు నింపుకున్నాడు కమిషనర్ సార్ అని ప్రజలు స్థానికంగా కోడైకుస్తున్న అసలు పట్టించుకోవట్లేదు.. ఇంకా కొందరైతే జి ప్లస్ టు అనుమతులు తీసుకొని ఐదు, ఆరు అంతస్తుల భవనాలు కూడా నిర్మిస్తున్నారని ఇలాంటి వారిని అడ్డుకోకుండా కమిషనర్ ఉంటున్నాడని స్థానికులు నిలదీస్తున్నారు. నోటీసులు ఇవ్వకుండానే ఇచ్చావ్ అంటూ ఒకవైపు అబద్ధాలనే నిజాలుగా ప్రకటించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇంకోవైపు బహుళ అంతస్తులు అక్రమ నిర్మాణాలు దర్జాగా నిర్మాణం కొనసాగిస్తుంటే అటువైపు కనీసం చూడకుండా అందిన కాడికి దోచుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు కమిషనర్ అని స్థానికులతో పాటు ఆయా ప్రజా సంఘాలు కోడైకూస్తున్నాయి... ఇప్పటికైనా పోచారం మున్సిపాలిటీ కమిషనర్ తన తీరు ప్రవర్తన వ్యవహారం మానుకొని ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడాలని లేకపోతే జిల్లా కలెక్టర్ కి ఈ కమిషనర్ వ్యవహారంపై తప్పకుండా ఫిర్యాదు చేస్తామని స్థానికులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు.



## నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న గోలి సంతోష్

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

హైదారాబాద్ మనికొండలో ప్రముఖ వ్యాపారవేత్త విబిజి గ్రూప్స్ భాగస్వామి మడిపపడిగే రాజు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం బుదవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ కి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్,తోట బిక్షపతి, అయిత సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ వాసవి బిజినెస్ గ్రూప్ ద్వారా వ్యాపారంలో రాణిస్తూ సమాజ సేవలో ముందుంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న మడిపదిగే రాజు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శ

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

గజ్వేల్ మండలంలోని జాలిగమ గ్రామనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గౌతి భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మండల సీనియర్ నాయకులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి తో కలిసి పరామర్శించారు. ఇటీవల పక్షవాతం సంభవించి మృత్యువాత పడటం పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారికి ధైర్యము తెలిపారు. పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని వారు పార్టీకి చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బారసా నాయకులు అశోక్ రావు మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శివయ్య,రాజేశ్వర్ రెడ్డి,నరసింహులు గౌడ్ లక్ష్మణ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు..


## కార్యకర్తకు భరోసా కల్పించిన మాజి ఎమ్పీపి



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

గజ్వేల్ మండలంలోని అనంతరావుపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజి ప్రతాప్ రెడ్డి లక్ష్మణరావును పరామర్శించారు. వారి వెంట గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు,స్థానిక తాజా మాజీ సర్పంచ్ మహేందర్ తదితరులు ఉన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం



**జయభేరి, వర్గల్, నవంబర్ 20 :**

మహాత్మ జ్యోతిబాపూలే వర్గల్ మహిళా డిగ్రీ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ డి. బాలలక్ష్మి, ఇంచార్జ్ ప్రతిభా బిశ్వాస్, కమిటీ సభ్యులు డాక్టర్ జానకి, యు రజిత ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గడ్డం భాస్కర్ రావు పేర్కొన్నారు. ఇందులో 22,000 పుస్తకాలు 14 రకాల మ్యాగజైన్స్ పది రకాల దినపత్రికలను ప్రదర్శించారు. పుస్తక ప్రదర్శనకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి గోవిందరావు, ఏటీపీ శ్రీమతి ఉమామహేశ్వరి వివిధ అధ్యాపకులు మరియు విద్యార్థులు పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శ



**జయభేరి, కొండపాక, నవంబర్ 20 :**

మండల కేంద్రమైన కొండపాక లో నిరుపేద కుటుంబానికి చెందిన రేపాక ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందరు..ఇట్టి సమాచారం తెలుసుకున్న అనంతుల ప్రశాంత్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం స్థానిక నాయకులచే అందించారు.



## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

- సన్మానం చేస్తున్న గజ్వేల్ బీజేపీ నాయకులు

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

ఉత్తరప్రదేశ్ లో డిసెంబర్ 10 నుంచి నిర్వహించే ఎస్జిఎఫ్ అండర్14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అర్&అర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ కు చెందిన విద్యార్థిని సందర్భంగా బిజెపి గజ్వేల్ పట్టణ శాఖ తరపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు చెప్యాల వెంకట్ రెడ్డి, నరసింహ ముదిరాజ్, నాయిని సందీప్, మైస విజయ్, గజ్వేల్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కుంకుమ రాణి, ఉపాధ్యక్షురాలు మంతూరి మమత, బిజెపి నాయకులు పవన్ కుమార్, దయాకర్ రెడ్డి, ఏలేశ్వరం ఎల్లం, అశోక్, స్వామి, మహిపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెదక్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్థానం సాధించడంలో ముఖ్య భూమిక పోషించడం అభినందించదగ్గ విషయమని అని తెలిపారు.

## ఉపాధ్యాయ సంఘాల ధర్నా వాయిదా

- కోర్టు ఉత్తర్వుల వెలువడనున్న నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నేతల ప్రకటన

**జయభేరి, నవంబర్ 20:**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన స్పౌస్ అవకతవకలపై ఈ నెల 21 న ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు వెల్లడించారు. ఈ అవకతవకలపై ఈ నెల 21 న కోర్టు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా విద్యాధికారి సూచన మేరకు ఈ ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వారు ప్రకటించారు. అయితే గురువారం జిల్లా. విద్యాశాఖఅధికారితో జేఏసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు బీ. వెంకటేశ్వర్లు, జయసింహ రెడ్డి, ఊరెళ్ల విఠల్, రాజ్ కుమార్, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ అధికారుల నజర్

- అంకిరెడ్డిపల్లి లో అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఆర్ఐ.. సూచిక బోర్డులు ఏర్పాటు




**జయభేరి, నవంబర్ 20:**

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని ఆర్ఐ రమేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 687/ఏ లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు అందడంతో దీనిపై ఆర్ఐ విచారణ చేపట్టారు. ఆనంతరం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మెపుదామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీజీపి జితేందర్

- కేసుల సత్వర పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సిబ్బందికి సూచన



**జయభేరి, నవంబర్ 20 :**

కేసుల సత్వర పరిష్కారం దిశగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ సూచించారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీజీపి కేసుల సత్వర పరిష్కారం పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బంది పనితీరును ప్రశంసించారు. అదేవిధంగా స్టేషన్ లో పచ్చదనం మరియు స్టేషన్ పరిసరాల్లో గ్రీనరీ, సందర్శనకు విచ్చేసే వారికి సరైన సదుపాయాల కల్పనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో మేడ్చల్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు, ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ హన్మంత్ గౌడ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎం సాధించారని విజయోత్సవాలు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**జయభేరి, పరకాల నవంబర్ 20:**



తెలంగాణా భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవరెడ్డి లతో కలిసి ధర్మారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో నవతరానికి రేవంత్ బూతుల ద్వారానే పైకి రావొచ్చని సందేశం ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ఏం సాధించారని రేవంత్ విజయోత్సవాలు జరుపుకుంటున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏం నెరవేర్చారని రేవంత్ సంబరాలు జరుపుతున్నారు. మహిళలకు రుణాలు రావాలంటే సభకు రావాల్సిందేనని ఒత్తిడి చేసి మరీ సభకి రప్పించారు. ప్రజలు ఎప్పుడో మరచి పోయిన బూతులను రేవంత్ మళ్ళీ నేర్పుతున్నారు అని అన్నారు. రాహుల్ గాంధీ ని చూసి కేసీఆర్ నేర్చుకోవాలా ?

రాహుల్ ఇంకా 30 సంవత్సరాలైనా పీఎం కాలేడు ఆయన్ను చూసి కేసీఆర్ ఏం నేర్చుకోవాలి. అని ఎద్దేవ చేశారు. రేవంత్ సభకు తన పార్టీకి చెందిన కొందరు మంత్రులు రాలేదు, జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే కూడా రాలేదు. మీరా మాకు చెప్పేది అని అన్నారు. మేము మొదలుపెట్టిన పనులకు అరకొర నిధులిచ్చి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. కానీ ఒక్క కొత్త పని చేసిన పాపానా పోలేదు మాకా చెప్పేది మీరు అని అన్నారు. సచివాలయం గేటు కూడా మారుస్తున్నారు. కొంపతీసి రేవంతే కట్టారని శిలాఫలకం వేస్తారా ? అని అన్నారు.

# మన ఓటు మన ఆయుధం

**జయభేరి, హైదరాబాద్ :**



మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకునే అవకాశం రాజ్యాంగం మనకు కల్పించిన ఒక గొప్ప వరం ఓటు హక్కు. ఓటు హక్కును మనం వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిపూర్ణం అవుతుంది. మనం వినియోగించుకునే ఓటుహక్కుతో దేశం కొన్ని కోట్ల అడుగులు ముందుకు పడి ప్రపంచ శక్తిగా అవతరిస్తుంది. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత దేశ పౌరులుగా మనందరిపై ఉంది. ఓటు హక్కుని వినియోగించుకోగలరు.

ప్రపంచ గతిని మార్చగల శక్తి ఉన్న అస్త్రం "ఓటు". ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి, వ్యవస్థ మార్పుకి నాంది పలికేది "ఓటు". ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమవంతు కర్తవ్యంతో ఉన్నతమైన నాయకుల్ని ఎన్నుకొనే విధానం. పురుషులతోపాటు మహిళలకు సమనహక్కు కల్పించిన మహిళల పక్షపాతి. ఆయన రాసిన రాజ్యాంగం వల్ల నేడు మహిళలు చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నారు, రాజకీయాల్లో ఉంటున్నారు.. కార్మికులకు ఉద్యోగులకు 8గంటల పని హక్కు కల్పించిన కార్మిక పక్షపాతి. భారతీయులందరికి 18 సంవత్సరాల వయస్సుకే ఓటుహక్కును కల్పించిన దేశ పౌరుల వేగు చుక్క ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే యువత నీకు ఓటు హక్కు ఇచ్చింది అంబేడ్కర్.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకోసం 5 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపల ఉన్నపిల్లలకు ఉచిత విద్యా హక్కు కల్పించిన భారత దేశ చిన్నారుల ఆణిముత్యం అంబేద్కర్. బానిస బ్రతుకులు బ్రతుకుతున్న అంటారనివాళ్ళ విముక్తి కోసం ఎస్సీఎస్టీబిసి లకు రిజర్వేషన్లు కల్పించి ఆరాధ్యుడు అంబేద్కర్. ఎస్సీ ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కలిపించిన గొప్ప వ్యక్తి దేశంలో రిజర్వ్ బ్యాంకు ద్వార ప్రతి ఒక్క భారతీయుడికి ఆర్థిక హక్కుల తో పాటు ఇంకా



వ్యాసకర్త: ఆలేటి రమేష్
99487 98982

ఎన్నో హక్కులను ప్రసాదించిన మహనీయుడు అంబేద్కర్. అన్నిటికంటే గొప్ప సంగతి దేశం గర్వపడే విషయం అంబేద్కర్ భారతీయులందరికి గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మహా జ్ఞాని. రాజ్యాంగం ద్వారా హక్కులు పొందిన ప్రతి ఒక్కరికీ నాయకుడు అంబేద్కర్.

ప్రజా యంత్రాం ప్రజాస్వామ్యం మనగలిగే ప్రజలు హాయిగా స్వేచ్ఛగా జీవించగలుగుతారు. భావవ్యక్తీకరణకు ప్రజలకు లభించిన వరం ప్రజాస్వామ్యం ప్రజలకు గొంతు ఇచ్చింది అరాచకాలపై పోరాడే హక్కు ఇస్తుంది ఇప్పటికీ పలు దేశాల్లో సౌదీ అరేబియా, వాటికన్ సిటీ మయన్మార్ లో ప్రజాస్వామ్యం ఏర్పడలేదు మరికొన్ని మత చాందస వాద దేశాల్లో ప్రజాస్వామ్యం మున్నా పరమతసహనం సున్నా ప్రజాస్వామ్యం లేని ప్రజల జీవితం దుర్భరం ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి ఓటు హక్కును నమ్ముకోవాలి అమ్ము కోకూడదు ప్రజాస్వామ్య సమాజంలో స్వేచ్ఛగా జీవించాలి. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే చట్టబద్ధమైన విధానాన్ని ప్రజాస్వామ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ నిర్వచించారు. ప్రజలు కనికరించి ఓటు వేస్తే పాలకులు అయ్యే రోజులు వచ్చాయి.. పటిష్టమైన ప్రజాస్వామ్యం ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం, ప్రజాస్వామ్య పునాదులు బలంగా లేని దేశాల్లో ప్రజాస్వామ్యం అనేది నేతిబీరకాయ చందంలా నిరుపయోగమే. ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఆయా దేశాల ప్రజలు చైతన్యవంతులై విద్యావంతులై ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగి ఉండాలి.

అంబేద్కర్ కల్పించిన ఆయుధం ఓటు.. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టి ప్రజలకు సుపరిపాలన అందించటంలో అత్యంత కీలకం కానీ ఓటు నోటుకు బానిసయ్యి ప్రజలను బానిసత్వంలోకి తీసుకెళ్లే పరిస్థితి గురించి ఆలోచించి ఓటు వేసి మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం భావి తరాలకు బంగారు బాట వేద్దాం.



## విజయోత్సవ సభలు దేనికోసం రేవంత్ రెడ్డి..?

- గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 20 :**

సంవత్సర కాలంలోనే తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని విజయోత్సవ సభలు జరుపుకుంటున్నారని ప్రజలకు వివరించాలని వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు ప్రచారాలతో ప్రజలకు ఇచ్చిన అమలు కాని ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు తెలిపారు. రేవంత్ రెడ్డిది ఫెయిల్యూర్ ప్రభుత్వమని వారు కొనియాడారు. అనేక హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయిందని వంటేరు ప్రతాప్ రెడ్డి మడిపడ్డారు. ఎన్నికల హామీల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో అసత్యాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం వెలుగులు విరజిమ్మి కళ్ళు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం తప్ప ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ రేవంత్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు, దీనికోసం విజయోత్సవలు జరుపుతున్నావా అని రేవంత్ రెడ్డిని ప్రతాప్ రెడ్డి ప్రశ్నించారు.ఇప్పటికైన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు

# మాయ మాటలకు మోసపోవద్దు

- రాజకీయ దురుద్దేశంతోనే బిఆర్ఎస్ నాయకులు విమర్శలు
- ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**జయభేరి, పరకాల, నవంబర్ 20:**



బుధవారం పరకాల నియోజకవర్గంలోని సంగెం మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఒప్పించి మామునూర్ ఎయిర్ పోర్ట్ క్లియరెన్స్ లకు కృషి చేయడం జరిగిందన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే టెక్స్ టైల్ పార్కును సందర్శించి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశానన్నారు. గత ప్రభుత్వ పాలకులు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నరు. మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మరెడ్డి మాట్లాడిన తీరు ప్రజలను తప్పు దారి పట్టించేలా ఉందని, ఒక ప్రణాళిక ప్రకారం విమర్శలు చేస్తున్నారని అన్నారు. టెక్స్ టైల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తున్నామని, ఆరోగ్య కేంద్రం మంజూరి చేయడమే కాకుండా, ప్రైమరీ స్కూల్ కూడా మంజూరైనదని తెలిపారు. టెక్స్ టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన వారికి 863 ఇందిరమ్మ ఇండ్లు ను 43.51 కోట్లతో మంజూరు చేసామని, కూడా లే అవుట్స్ కి 2.17 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. టెక్స్ టైల్ పార్క్ ఆవరణలో వాటర్ లాగింగ్ అవుతుంది, అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే నాలా అభివృద్ధికి 160.92కోట్లు ఒకేసారి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎయిర్ పోర్ట్ రావడం వల్ల పరిశ్రమలు వస్తాయని, దానితో చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి దోహదపడుతుందని, గ్రామాలలోని నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

## మనందరి సమిష్టి కృషితో

- చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**జయభేరి, హన్మకొండ, నవంబర్ 20:**



వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్యమైన మాస్టర్ ప్లాన్ 2041, కాళోజి కళాక్షేత్రం పూర్తి అయిన సందర్భంగా బుధవారం కుడా కాన్ఫెరెన్స్ హాల్ లో కార్యాలయ సిబ్బందితో సక్సెస్ మీట్ ను నిర్వహించిన చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే. ఈ కార్యక్రమంలో పివో అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, సెక్రటరీ మురళీధర్ రావు లు పాల్గొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన కాళోజి కళాక్షేత్రం, వరంగల్ మాస్టర్ ప్లాన్ 2041లు పూర్తి అయిన సందర్భంగా అందరి సమీక్షంలో విజయంగా కేక్ కట్ చేసిన కుడా చైర్మన్, వైస్ చైర్మన్ అనంతరం సిబ్బందికని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ.. మనందరి సమిష్టి కృషితో పని చేయటం వల్లనే కళాక్షేత్రం, మాస్టర్ ప్లాన్ లను పూర్తి చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని, మున్ముందు ఇలానే కష్టపడి పని చేసి ఇతర ప్రాజెక్టు లను కూడా పూర్తి చేసుకోవాలని కార్యాలయం సిబ్బందిని కోరారు. కుడా అభివృద్దే అన్ని నియోజకవర్గాల అభివృద్ధి కాబట్టి చిత్తశుద్ధితో పనిచేయాలని సిబ్బందిని కోరారు.

## కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా కవి సమ్మేళనం

- కుడా చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి ని సన్మాణించిన కాళోజీ ఫౌండేషన్



**జయభేరి, హన్మకొండ, నవంబర్ 20:**

కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫౌండేషన్ కార్యదర్శి వి. ఆర్. విద్యార్థి అధ్యక్షతన కవి సమ్మేళనం ఏర్పాటు చేయటం జరిగింది. కాళోజీ కళాక్షేత్రంను ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషకరమని అధ్యక్షులు అన్నారు.ఈ సందర్భంగా కాళోజీ ఫౌండేషన్ తరుపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అంటూ జీవితమంతా సమాజం కోసం అంకితం చేసిన మహా వ్యక్తి, శక్తి కాళోజీ అని వరంగల్ కవిలోకం ఎదురుచూసిన కల ఆవిష్కృతమైందని కవులు, రచయితలు, కళాకారులు వరంగల్ ను గొప్ప సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాళోజీ ఫౌండేషన్ సభ్యులు కుడా చైర్మన్ ని సన్మాణించారు.



# కాళేశ్వరం విచారణకు కేసీఆర్ రావాల్సిందేనా..



**జయభేరి, కరీంనగర్, నవంబర్ 20:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ హీట్ క్రియేట్ చేస్తోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌విచారణను స్పీడప్ చేసింది.ఆరోపణలు, అక్రమాలకు సంబంధించి ఇప్పటికే పలువురు అధికారులను విచారించింది కమిషన్. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ నెల 21న మరోసారి హైదరాబాద్‌కు రాబోతుందట. వచ్చే నెల 5 వరకు ఇక్కడే ఉండి పలువురిని విచారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్..మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పుడు ఇరిగేషన్ మినిస్టర్‌గా పనిచేసిన హరీశ్ రావును కూడా విచారణకు పిలుస్తారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ కొనుగోళ్ల ఇష్యూలోనే కేసీఆర్‌ను ఇరికించే ప్రయత్నం జరిగింది. అప్పుడు విద్యుత్ కమిషన్ నోటీసులు ఇస్తే మాజీ సీఎం విచారణకు హాజరుకాలేదు. అంతేకాదు జస్టిస్‌నరసింహారెడ్డి కమిషన్‌కు విచారణార్హత లేదంటూ లేఖ రాశారు. న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్‌ఏర్పాటైందని..అలాంటి కమిషన్‌ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేసీఆర్. దాంతో ఏకంగా విచారణ కమిషన్ చైర్మన్ నే మార్చాల్సి వచ్చింది సర్కార్ కు. మరి ఇప్పుడు కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌ను విచారణ పిలిస్తే వెళ్తారా.? కేసీఆర్ విచారణకు హాజరుకాకపోతే కమిషన్ ఎలా ముందుకు వెళ్తుందనేది ఉత్కంఠ రేపుతోంది.కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి..ఈ నెలాఖరున కేసీఆర్‌కు పిలుపు రాబోతుందన్న ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ విచారణకు వెళ్లకపోతే అరెస్ట్ చేస్తారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ అంత డేర్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని హంగామా చేసిన కాంగ్రెస్ఇప్పటికే డైలమాలో పడింది. లగచర్ల ఘటనలో కేటీఆర్ అరెస్ట్‌పై బ్యాక్ స్టెప్ వేసినా కాంగ్రెస్ పెద్దలు..ఫార్ములా ఈ రేస్ కేసులో గవర్నర్ అనుమతి రాగానే ఆయన్ను జైలుకు పంపుతామంటున్నారు. ఇంతలోనే కాళేశ్వరం విషయంలో కేసీఆర్ కార్నర్ చేసే ప్రయత్నం జరుగుతోందిఅయితే విచారణకు కేసీఆర్‌హాజరవుతారా? లేక జస్టిస్‌ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసినట్లుగా..జస్టిస్‌పీసీ ఘోష్‌కు లేఖ రాసి దూరంగా ఉంటారా? అన్న చర్చ సాగుతోంది. జస్టిస్ఎల్.నర్సింహారెడ్డి స్థానంలో నియమితులైన జస్టిస్‌మదన్‌భీంరావు లోకూర్‌కమిషన్‌మాత్రం కేసీఆర్‌ను విచారణకు పిలవకుండానే నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇప్పుడు కూడా కేసీఆర్‌విచారణకు రాకపోతే.. ఆయన ఇచ్చే లేఖనే అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పీసీ ఘోస్ కమిషన్ విచారణపై కూడా కేసీఆర్ స్టడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ తనకు నోటీసులు ఇస్తే ఎలా రియాక్ట్ కావాలో కూడా గులాబీ బాస్ ఓ క్లారిటీకి వచ్చినట్లు ఇన్‌సైడ్ టాక్.ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి హామీలు, గ్యారెంటీల విషయంలో తీవ్ర ఒత్తిడిని ఫేస్ చేస్తోంది కాంగ్రెస్. అందుకే అపోజిషన్‌లో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన ఇష్యూస్‌లో కేసీఆర్ ఫ్యామిలీని ఇరికించి సైలెంట్ అయిపోయేలా చేయాలని ప్లాన్ చేస్తోందట రేవంత్ సర్కార్. ఈ టైమ్‌లో అటు కాళేశ్వరం విచారణ..ఇప్పటికే జరుగుతోన్న ఫార్ములా ఈ రేస్ కేసు దర్యాప్తు..ఏది ముందు..దేంట్లో అరెస‌ట్‌లు ఉంటాయనేది టెన్షన్ క్రియేట్ చేస్తోంది.పీసీ ఘోష్ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు అవుతారా లేదా అన్నది ఒక డిస్కషన్ అయితే. ఎలా స్పందిస్తారనేది ఇంకో పాయింట్. అదే సమయంలో ఫార్ములా ఈ రేస్ విషయంలో గవర్నర్ అనుమతిస్తే ప్రభుత్వం ఏం చేయబోతుందనేది కూడా హాట్ టాపిక్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఎవరి అరెస్ట్ ఉంటుంది. ముందు అరెస్ట్ అయ్యేది తండ్రా.. తనయుడా అనేది ఉత్కంఠ రేపుతోంది.



## కాంగ్రెస్ రాజ్యంలో ప్రతిరోజు అరెస్టులు

**జయభేరి, చందంపేట :**

కాంగ్రెస్ రాజ్యంలో ప్రతిరోజు అరెస్టులు ఈరోజు తలపెట్టిన లగచర్ల గిరిజన గ్రామ సందర్శనకు బయలుదేరు చుండగా ఇంటి వద్దనే వెళ్లకుండా అడ్డుపడి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లడం జరిగింది ఇందిరమ్మ రాజ్యంలో ఒక ఊరు నుండి ఇంకో ఊరికి వెళ్లకూడదా, ఇదేమి రాజ్యం, లగ చర్ల అమాయక గిరిజనులను చిత్రహింసలు పెట్టి సంగారెడ్డి జైల్లో పడేసినారు అట్టి వారి కుటుంబానికి ఓదార్చడానికి వెళ్లడానికి తప్ప ఇది ఏ చట్టంలో ఉంది అరెస్ట్ చేయడానికి మనమందరం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేమా ప్రజలారా ఆలోచించండి మేల్కొండి అని జరుపుల లోక్య నాయక్ తెలియజేసినారు.

## సైదాపూర్ మండలం మార్కెట్ కమిటీ చైర్మన్గా దొంత సుధాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు



**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంతు సుధాకర్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియమాకానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కు మండల ప్రజా ప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు యూత్ కాంగ్రెస్ నాయకులకు మండల ప్రజలకు కృతజ్ఞతలు. నాతోపాటు ఎన్నికైన కమిటీ సభ్యులు నాదెండ్ల రాజకుమార్ ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు నల్లి సదానందం, మొహమ్మద్ చోటా మియా, పల్లె గోపాల్ రెడ్డి, బొల్లం సోమయ్య, పెద్ది తిరుపతి, బైరి రాజు, చల్లూరి రాజయ్య, మద్దూరి రజిత, తాళ్లపల్లి వెంకటేశం, ఉడిగే రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శక్తి అభియాన్ జ్ఞాపిక

- మైనంపల్లి మాజీ MPTC కొర్ర గౌతమి రామ్ సింగ్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆదేశానుసారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇందిరా ఫెలో ముఖాముఖీ కార్యక్రమంలో శక్తి అభియాన్ జ్ఞాపికను అందించిన మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి రామ్ సింగ్ నాయక్. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఇందిరా ఫెలో సభ్యులతో జరిగిన ముఖాముఖీ సమావేసానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమీ పాల్గొని ముఖ్యమంత్రికి శక్తి అభియాన్ కార్యక్రమం గురించి వివరించి జ్ఞాపికను అందించారు. ముఖ్యమంత్రి మాజీ ఎంపిటిసి గౌతమి రాంసింగ్ నాయక్ ని అభినందించినారు.



## ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు

- వీడిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా లావుడియా బాషా
- విలేజ్ డెవలప్మెంట్ సొసైటీలో అత్యున్నతమైన సేవలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత లావుడియా భాష విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఎన్నికయ్యారు. డాక్టర్ పడల రామయ్య చేతుల మీదుగా ఈనెల 19వ తేదీన ఎన్నిక పత్రం అందుకున్నారు. విలేజ్ డెవలప్మెంట్ సొసైటీలో నిజాయితీ నిబద్ధతతో తాను అమూల్యమైన సేవలు అందించినందుకు గాను,



తనను రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఎన్నుకున్నట్లు తెలిపారు. అసాధారణమైన సామాజిక సేవకు గుర్తింపుకు గాను గతంలో బహుజన సాహిత్య అకాడమీ వారు ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు కూడా బహుకరించారని తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో వీడిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఎన్నుకున్నందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇంకా ముందుకు వెళ్తానని తెలిపారు. మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు.వీడిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఎన్నికైనందుకు చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా డాక్టర్ పడాల రామయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఎన్నుకోవడం అంటే పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నారని తెలిపారు.

## ప్రతి షాప్ యజమానులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

**జయభేరి, ఘట్కేసర్ :**




ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో మొబైల్ షాప్ అసోసియేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, CI పరశురాం, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, BRS పార్టీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్. ఈ సందర్భంగా చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ముందుగా అసోసియేషన్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం చాలా చక్కటి పని అని దీని ద్వారా ప్రతి ఒక్క షాప్ వారు ఒక్కరి మాటకి విలువలు ఇస్తూ వ్యాపారం చేసుకోవచ్చని, అదేవిధంగా కొన్ని చోట్ల నకిలి ఫోన్లు విక్రయిస్తున్నారని అలాంటి వాటికి ఆపు చేయవచ్చని తెలుపుతూ, ప్రతి ఒక్కరు తమ తమ వ్యాపారం మంచిగా చేసుకొని నలుగురికి ఉపాధి కల్పించాలని, దొంగలించ బడిన ఫోన్స్ వస్తే వెంటనే పోలీస్ అధికారులకు తెలపాలని, లేనియెడల విక్రయదారుడి ఆధార్ కార్డ్ తీసుకోవాలని తెలుపుతూ ప్రతి షాప్ యజమానులు తమ షాప్ యొక్క ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, నాయకులు అన్ను, సిరాజ్, కృపనిది, పల్లె విజయ్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తాడిలో రాంకీ అక్రమ ల్యాండ్ ఫీల్ పనులను చేపట్టడం దుర్మార్గమైన చర్య

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం తాడి గ్రామాన్ని ఆనుకొని సర్వేనెంబర్ 116 లో రాంకీ బరి తెగించి ఒకవైపు కోర్టులో కేసుంటుండగా మరోవైపు ల్యాండ్ ఫిల్లింగ్ గ్రామసభ వ్యతిరేకించిన దౌర్జన్యంగా ల్యాండ్ ఫీల్ పనులు చేపట్టడం దుర్మార్గమైన చర్యని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాంకీ యాజమాన్యం చేస్తున్న అక్రమ ల్యాండ్ ఫీల్ ఆపకపోతే తాడికి మరో కాలుష్య కుంపటి పెట్టినట్లేనని రాష్ట్ర ప్రభుత్వం కూటమి నేతలు రాంకీ యాజమాన్యానికి అండగా నిలుస్తారా లేక ప్రజలకి అండగా నిలుస్తారో తెలియజేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తాడి గ్రామం కాలుష్యాన్ని గుర్తైనట్లు మంచినీరు సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని రోజుకి 20 లీటర్ల నీటి సరఫరా అని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో చేస్తున్నారని కానీ భూగర్భ జలాల నాశనం అవడంతో తీవ్రమైన కాలుష్యంతో ప్రజల అల్లాడుతున్నారని వెంటనే కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు.


## పెదముసిడివాడ చెరువులో ఆక్రమ రహదారి తొలిగింపు



**జయభేరి, పరవాడ:**


పరవాడ మండలంలో పెదముసిడివాడ గ్రామంలో జరుగుతున్న భూ అక్రమాలు గురించి ఇటీవల ఆ గ్రామ గ్రామస్థులు జిల్లా,మండల అధికారులకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం విధితమే,దీని పై స్పందించిన మండల రెవిన్యూ అధికారులు బుధవారం గ్రామంలో సర్వే నెంబరు 114 ఇసరపువాణి చెరువులో స్థానిక అక్రమ లే అవుట్ గురించి చెరువు మధ్య లో నుంచి వేస్తున్న రహదారిని గ్రామ వీఆర్వో దగ్గర ఉండి జేసీబీ సహాయంతో తవ్వియించి చెరువు లో ఆక్రమణలు తొలగించారు.వీరితో పాటు గ్రామ టీడీపీ నాయకులు బంధం వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు




**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడ ధరి జీవీఎంసీ 79వార్డు దేశపాత్రినిపాలెం లో సర్వేనెంబర్ 334 లో ఉన్న గ్రావెల్లునుఅనుమతులు లేకుండా కొంతమంది జేసీబీ లారీలతో తరలిస్తుండగా రెవిన్యూ అధికారులకు అందిన సమాచారం మీదకు పోలీస్ శాఖ వారితో కలిసి అక్రమ గ్రావెల్ తవ్వకాలపై దాడులు చేసి రెండు జెసిబిలు, ఒక లారీని స్వాదినం చేసికొని వాటిని పరవాడ పోలీస్ స్టేషన్కు తరలిచారు.




## షిరిడి సాయి నగర్ లో మొక్కలు నాటిన కార్పొరేటర్ రౌతు



**జయభేరి, పరవాడ:**

జీవీఎంసీ పరిధిలో 79 వ వార్డు అగనంపూడి వద్ద శ్రీ షిరిడి సాయి నగర్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్బరాజు,అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు, అసోసియేషన్ పెద్దలు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.




## సూర్య, త్రిష కాంబినేషన్

# వన్స్‌మోర్..!


కోలీవుడ్ హీరో సూర్య శివ దర్శకత్వంలో నటించిన కంగువ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. కాగా సూర్య ఇక నెక్ట్స్ చేయబోయే సినిమాలపై ఫోకస్ పెట్టాడు. ఇప్పటికే స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం లో సూర్య 44, సుధా కొంగర డైరెక్షన్‌లో సూర్య 43కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. వీటితోపాటు ఆర్జే బాలాజీ డైరెక్షన్‌లో సూర్య 45 కూడా చేస్తున్నాడు. కొన్ని రోజుల ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూనే ఉంది. నవంబర్‌లోనే ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్తుందని ఇప్పటికే ఓ అప్‌డేట్ తెరపైకి వచ్చింది. తాజాగా క్రేజీ న్యూస్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ సినిమాలో సూర్యకు జోడీగా చెన్నై సుందరి త్రిష మరోసారి మెరువబోతుందని, దీనిపై అధికారిక రావడమే ఆలస్యమని ఇన్‌సైడ్ టాక్. ఇదే నిజమైతే సూర్యత్రిష కాంబోలో రాబోయే మూడో సినిమా కానుంది. ఆర్జే బాలాజీ డైరెక్షన్‌లో MaasaaniAmman చేయాల్సి ఉండగా.. ఇప్పుడు ఆ సినిమా స్థానంలో సూర్య 45 చేరిపోయింది. ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.





## విమర్శలను పట్టించుకోను

'సినిమాల ఎంపికలో నేను చాలా సెలెక్టివ్‌గా ఉంటాను. రొటీన్‌కు భిన్నంగా వైవిధ్యమైన కథలకే ప్రాధాన్యతనిస్తాను. 'జెర్సీ' తర్వాత అవకాశాలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత కొన్ని ఫ్లాపులొచ్చాయి. అయినా ఎప్పుడూ బాధపడలేదు. ఈ ప్రయాణంలో నటిగా మరింత పరిణితి సాధించానని భావిస్తున్నా' అని చెప్పింది శ్రద్ధాశ్రీనాథ్. ఆమె విశ్వక్‌సేన్ సరసన కథానాయికగా నటించిన 'మెకానిక్ రాకీ' చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను మాయ అనే అమ్మాయిగా కనిపిస్తా. ఇప్పటివరకు చేయని డిఫరెంట్ క్యారెక్టర్. మెకానిక్ రాకీ జీవితంలో మాయ ఎలాంటి మార్పులకు కారణమైందనే అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇండస్ట్రీలో తనకు గాడ్‌ఫాదర్స్ ఎవరూ లేరని, హిట్, ఫ్లాప్‌స్‌ను సమదృష్టితో చూడటం అలవాటు చేసుకున్నానని, విమర్శలను కూడా అంత సీరియస్‌గా తీసుకోనని శ్రద్ధా శ్రీనాథ్ పేర్కొంది. బాహుబలి, కల్కి వంటి పీరియాడిక్ కథల్లో నటించాలన్నది తన డ్రీమ్ అని, ప్రస్తుతం తెలుగులో 'డాకు మహారాజ్' చిత్రంలో నటిస్తున్నానని చెప్పింది.




## మైసూర్‌లో యాక్షన్ షురూ?

రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ వారంలోనే మైసూర్‌లో షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారని తెలిసింది. రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై అక్కడ కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కిస్తారని సమాచారం. ఉత్తరాంధ్ర నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. ఏ.ఆర్. రెహహాన్ సంగీతాన్నందిస్తున్నారు. భారీ వ్యయంతో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఇదిలావుండగా రామ్‌చరణ్ తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్' జనవరి 10న ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ఆస్తులు

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. ఆయన భార్య సైరా భానుతో విడిపోయారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ముగింపు ప్రకటించారు. విడాకులపై అడ్వకేట్ సమాచారం అందించారు. ఈ క్రమంలో ఏఆర్ రెహమాన్ ఆస్తులపై చర్చ సాగుతున్నది. ప్రస్తుతం అత్యధికంగా సంపాదిస్తున్న భారతీయ సంగీత దర్శకుల్లో ఆయన ఒకరు. రికార్డ్ ప్లేయర్‌గా తొలిసారిగా రూ.50 పారితోషకం అందుకున్న ఏఆర్ రెహమాన్ ప్రస్తుతం నికర సంపద రూ.1700కోట్లు. రోజా మూవీతో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చిన రెహమాన్.. ఆ సమయంలో రూ.25వేలు అందుకున్నాడు. లైఫ్ స్టయిల్ ఆసియా నివేదిక ప్రకారం.. స్లమ్‌డాగ్ మిలియనీర్‌కు ఆస్కార్‌ను అందుకున్న రెహమాన్ నికర ఆస్తుల విలువ 200 నుంచి 400 మిలియన్ డాలర్లు. భారతీయ కరెన్సీలో అక్షరాల రూ.1700కోట్లు. ప్రస్తుతం ఒక్కో సినిమాకు స్వరాలు సమకూర్చేందుకు రెహమాన్ దాదాపు రూ.8కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు ఛార్జ్ చేస్తున్నారు. ఆయన కేవలం ఒక పాట కోసం రూ.3కోట్ల వరకు వసూలు చేయనున్నారు. అంతేకాకుండా ఆయన లైవ్‌షోలు సైతం చేస్తుంటారు. దాంతో భారీగానే ఆదాయం ఆర్జిస్తున్నారు. ఒక్కో గంటకు దాదాపు రూ.కోటి నుంచి రూ.2కోట్ల వరకు వసూలు చేస్తారు. రెహమాన్‌కు భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ బంగ్లాలు ఉన్నాయి. భారత్‌లో చెన్నైతో బంగ్లాతో పాటు అమెరికాలోని లాస్ ఏంజిల్స్, దుబాయిలో ఇండ్లు ఉన్నాయి. వోల్వో ఎస్‌యూవీ, జాగ్వార్, మెర్సిడెజ్ తదితర ఖరీదైన కార్లు ఉన్నాయని ఓ నివేదిక పేర్కొంది. కుమార్తెలు ఖతీజా, రహీమా వద్ద రూ.1.5కోట్ల విలువైన ఎలక్ట్రిక్ పోర్స్చే టైకాన్ కార్లు ఉన్నాయి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com